క్లుప్తంగా

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మునగాల : మండలంలోని రేపాల గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా శౌంతి పరుశరాములుగౌడ్, కమిటీ సభ్యులుగా బత్తుల లింగరాజు, గడ్డం కరుణాకర్‌రెడ్డి, చెవుల సునీత, గడ్డం వెంకటరెడ్డి, మేక నరేందర్‌రెడ్డిని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పరుశరాములు మాట్లాడుతూ.. గ్రామపెద్దలు, ప్రజల సహకారంతో దేవాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సాయి కృష్ణమాచార్యులు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పల్లి ఆదిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గండు వరమ్మ, గండు నాగమణి, గ్రామపెద్దలు గడ్డం సురేందర్‌రెడ్డి, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

హుజూర్‌నగర్ : కార్మికులు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కార్మిక సంఘం నియోజవర్గ అధ్యక్షుడు పి.ఉపేందర్ అన్నారు. గురువారం పట్టణంలో హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, కీతవారిగూడెం గ్రామాల ట్రాక్టర్ మెకానిక్‌ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీమా పథకాన్ని మెకానిక్‌లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మెకానిక్‌లు జానకిరామయ్య, అనిల్‌కుమార్, నరసింహారావు, రాము, వెంకన్న, శ్రీను, జానయ్య, కాశయ్య, రాంబాబు, కృష్ణ పాల్గొన్నారు.

బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరం



బాలకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లికి చెందిన బాలకృష్ణారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చౌటపల్లిలో మృతుడి నివాసానికి వెళ్లి బాలకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గంగసాని ఎల్లారెడ్డి, లింగయ్యయాదవ్, రామిరెడ్డి ఉన్నారు.

ఇస్మాయిల్‌కు మాజీ ఎమ్మెల్యే పద్మావతి పరామర్శ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్.ఇస్మాయిల్‌ను గురువారం మాజీ ఎమ్మెల్యే పద్మావతి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇస్మాయిల్‌కు 75శాతం దివ్యాంగ ధృవీకరణ పత్రం ఉన్నా ఆయనకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడంలేదన్నారు. కావాలనే అధికార పార్టీ నాయకులు మంజూరు కానివ్వడంలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఆమె వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, నాయకులు ఎస్‌కె.రియాజ్, లింగరాజు, విజయ్, వంశీ, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

జగన్ మృతి తీరనిలోటు

కోదాడరూరల్ : పట్టణానికి చెందిన పబ్లిక్ క్లబ్ శాశ్వత సభ్యుడు విప్పకుంట్ల జగన్‌మోహన్‌రెడ్డి మృతి బాధాకరమని ఆ క్లబ్ అధ్యక్షుడు వక్కవంతుల నాగార్జున అన్నారు. గురువారం స్థానికంగా గల పబ్లిక్ క్లబ్‌లో ఇటీవల మృతి చెందిన జగన్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. జగన్ ఆదర్శప్రాయుడని, ఆయన మృతి క్లబ్‌కు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ వల్లూరి రాంరెడ్డి, చింతలపాటి శ్రీనివాసరావు, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, చిన్నపరెడ్డి, బొల్లు రాంబాబు, నరసయ్య తదితరులు ఉన్నారు.

ఎన్‌టీ రామారావుకు భారతరత్న ప్రకటించాలి

కోదాడరూరల్ : ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావుకు భారతరత్న ప్రకటించాలని టీడీపీ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఆయన అని తెలిపారు. అలాంటి వ్యక్తికి భారతరత్న అవార్డు ఎందుకు ప్రకటించడంలేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఆయనకు అవార్డు ఇవ్వాలని లేని పక్షంలో పోస్ట్‌కార్డు ఉద్యమం చేపడతామని తెలిపారు.

వానరాలతో బెంబేలు

- గ్రామాల్లో గుంపులుగా సంచారం, వీధుల్లో తిష్ట
- ఇళ్లల్లోకి చొరబాటు.. భయపడుతున్న పిల్లలు, మహిళలు
- పట్టించుకోని పాలకవర్గాలు, అధికారులు



గ్రామాల్లో తిరుగుతున్న వానరాలు

మేళ్లచెరువు : గ్రామాల్లో కోతుల బెడద అధికమైంది. గుంపులు గుంపులుగా కోతులు వీధుల్లో సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి నానా హంగామా సృష్టిస్తున్నాయి. గుంపులుగా వీధుల్లో, ఇళ్ల పైకప్పులపై చేరి భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఒంటరిగా ఉన్న వారిపై దాడికి దిగుతున్నాయి. ఇదివరకున్న కోతులకు తోడు ఇటీవలే కొత్తగుంపులు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని కందిబండ, రామాపురం, రేవూరు, యతిరాజాపురండా గ్రామాల్లో వానరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల నుంచి ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారు. మహిళలు, చిన్నపిల్లలు చేతుల్లో ఉన్న వస్తువులను లాక్కొని మరి వారిని కరుస్తుండడంతో గాయాలపాలువుతున్నారు. ఇళ్లలో తలుపులు తీసి ఆదమరచి బయటకు వస్తే ఇంట్లో చొరబడి విలువైన వస్తువులను సైతం బయట పడేస్తున్నాయి. ఒక్కోసారి గుంపులుగుంపులుగా ఒంటరి వ్యక్తులపై దాడులు చేస్తుండంతో ఈ దాడుల్లో గాయాలపాలై ఆసుపత్రుల్లో తిరిగే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. అదేవిధంగా పొలాల్లో ఏ పంట వేసుకున్నా పూత, పిందె దశలో పంటలను పాడు చేస్తున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇంత జరుగుతున్నా గ్రామ పంచాయతీ పాలకవర్గం గాని, అధికారులు గాని కోతులను నివారించడానికి ఎటువంటి చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఉపయోగం లేకుండా పోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో పంట పొలాలపై, రామాపురం, కందిబండ గ్రామాల్లో ఉన్న మామిడి తోటలను పాడుచేస్తుండడంతో రైతులు ఏమీ చేయాల్లో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గాలు గ్రామాల్లో కోతులను పట్టించి అడవుల్లోకి తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.పడింది. ఒంటరిగా ఉండాలంటే భయంగా ఉంది. కోతులు గుంపులుగా వచ్చి పొలాల వద్ద మోటార్ల వైర్లు, ఇతర సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి.

వీధుల్లో సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి



కోతులు వీధుల్లో సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంట్లో వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. అదేవిధంగా పొలాల్లో ఒంటరిగా ఉన్న వ్యక్తులపై కోతులు దాడులు చేస్తున్నాయి, గొర్రెల మేపడానికి వెళ్లిన నాపై గొర్రెలపై కోతులు దాడిచేశాయి. ఈ దాడిలో గొర్రె పిల్ల గాయపడింది.

– లక్ష్మయ్య, రాఘవాపురం

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మోతె : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో ఆయన పర్యటించి బొర్రోళ్ల వాగుపై రూ.30లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సిరికొండలో సహకార బ్యాంక్ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం నాబార్డు నిధులతో సుమారుగా రూ.50లక్షలతో నిర్మించిన 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం, స్టోర్ రూంలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిరికొండ సహకార బ్యాంక్ చైర్మన్ కొండపల్లి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్మించిన గోదాములను వినియోగించుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు అండగా నిలిచాయన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధి కొరకు రైతు బంధు, రైతు రుణాలు వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అన్ని వర్గాలకు ప్రజా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మండలంలో రూ.67లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంక్ సీఈఓ మధన్‌మోహన్, డీజీఎం అశోక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావునాయక్, గ్రామ సర్పంచ్ నూకల సావిత్రమ్మ, ఉపసర్పంచ్ బొర్ర మధుసూదన్, సిరికొండ సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ హలావత్ మదారు, సీఈఓ అనంతరెడ్డి, డైరెక్టర్లు, బ్యాంక్ సిబ్బంది, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఆరె లింగారెడ్డి, ఎంపీటీసీ కాంపాటి వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

మఠంపల్లి : మండల కేంద్రంలో నేడు (శుక్రవారం) నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సైదిరెడ్డి మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. సమ్మేళనానికి భారీగా తరలిరానున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, వరదాపురం, మఠంపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు పిండిప్రోలు రామచంద్రయ్య, గ్రంథాలయ చైర్మన్ భద్రంరాజు రామారావు, మాజీ సర్పంచ్ కొండేటి సుధాకర్‌రెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షుడు పఠాన్ హఫీజ్‌ఖాన్, నవీన్‌నాయక్, నరేష్, రవీందర్‌నాయక్, తదితరులున్నారు.

పల్లె దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్



గరిడేపల్లి : పల్లె దవాఖానా పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్



హుజూర్‌నగర్ : ఆస్పత్రిని సందర్శించి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

గరిడేపల్లి : పల్లె దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని రాయినిగూడెంలో రూ.12లక్షలతో చేపట్టిన పల్లె దవాఖాన తుది పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. చిన్నచిన్న పనులు పూర్తి చేసి తక్షణమే ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. శుక్రవారం దవాఖానను ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఆర్డీఓ వెంకారెడ్డి, తహసీల్దార్ కార్తీక్, ఎంపీడీఓ వనజ, పీఓ సాహితి, సర్పంచ్ దోసపాటి భిక్షం, వైద్యాధికారి నరేష్, సోములమ్మ, ప్రమీల, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశావర్కర్లు తదితరులున్నారు.

బస్తీ దవాఖాన పరిశీలన..

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని రాంపురంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బస్తీ దవాఖాను గురువారం అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం బస్తీ దవాఖానను ప్రారంభించేందుకు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మలేరియా జిల్లా అధికారి సాహితి, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మండల తహసీల్దార్ సరిత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు బస్తీ దవాఖాన ప్రారంభం

మున్సిపాలిటీలోని రాంపురంలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన బస్తీ దవాఖానను రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చేతులమీదుగా నేడు(శుక్రవారం) ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు తెలిపారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బస్తీ దవాఖానను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఏరియా ఆస్పత్రి సందర్శన..

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం సందర్శించారు. రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి శుక్రవారం ఆస్పత్రిలో సమీక్షా సమావేశానికి రానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన ఏర్పాట్లు, జాగ్రత్తలపై వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కోటచలం, ఆర్డీఓ వెంకారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కరుణ్‌కుమార్, సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోర్టల్‌లో నిరంతరం నూతన ఓటర్ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకారెడ్డి

హుజూర్‌నగర్ : ఇక నుంచి కొత్త ఓట్లను నేషనల్ ఓటర్స్ సర్వీస్ (ఎన్‌వీఎస్) పోర్టల్‌లో నిరంతరం నమోదు చేసుకోవచ్చనని ఆర్డీఓ వెంకారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీవారం ఎలక్షన్ కమీషన్ వారు అందించే సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తెలియజేస్తామన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై ఆరుగురు కంటే ఎక్కువ ఉన్న ఓటర్ల జాబితా ఇవ్వడం జరిగిందన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఆ జాబితాలోని ఇంటి నంబర్‌పైన ఓటర్లు నివాసం ఉన్నారా లేదా అని నిర్ధారణ చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎవరి ఇంటి నంబర్ అయినా తప్పుగా నమోదైతే ఫార్మ్ –8 ద్వారా సవరణ చేస్తారని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, సూపర్‌వైజర్‌లు, బీఎల్‌ఓలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో 'రేస్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రేస్ కళాశాల చైర్మన్ బాణాల వసంత

కోదాడరూరల్ : పట్టణంలోని రేస్ ఐఐటీ, మెడికల్ కళాశాల విద్యార్థులు గురువారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ బాణాల వసంత తెలిపారు. బైపీసీ విభాగంలో కె.హరిణి 884వ ర్యాంక్, డి.మేఘన 1745, సయ్యద్ మదిహా 2382, వై.సాయిశ్రీ 5187, కీర్తన 6544, ఎస్‌కె.జారా 9362 ర్యాంక్ సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో కె.మహాలక్ష్మి 1523, ఈ.సాయినికితరెడ్డి 2024, యు.అక్షర సమైక్య 2191, సుఖేష్‌రెడ్డి 2414, ఎం.విజితరోహిణి 2524, ఎన్.ప్రవణిక 2771 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వసంత మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ర్యాంకుల సాధనకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

మహానాడును జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : ఏపీలోని రాజమండ్రిలో ఈనెల 28న ఎన్టీఆర్ శత జయంతి దినోత్సవం సందర్భంగా నిర్వహించే టీడీపీ మహానాడును జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు బెల్లంకొండ రామజోగి, సోమగాని నరేందర్ కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.శ్రీనివాస్, జి .శ్రీను, వై.వెంకటేశ్వర్లు, వెంకట్రాం, పి.సత్యనారాయణ, శ్రీను, రాజు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్య తీసుకోవాలి

హుజూర్‌నగర్ : పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న తన ఇంటి గదిని అర్ధరాత్రి కొందరు కూల్చివేశారని పట్టణానికి చెందిన అయిల వీరకృష్ణ గురువారం తెలిపారు. సంబంధిత అధికారులు విచారణ చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పాలకవర్గం పొడిగింపుపై హర్షం

చిలుకూరు : ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) పాలకవర్గాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తున్నట్లు మండల కేంద్రానికి చెందిన డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య గురువారం విలేకరులకు తెలిపారు. పాలకవర్గాన్ని పొడిగించడం పట్ల సీఎం కేసీఆర్‌కు, స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా రోడ్ల వెంట ఉన్న డబ్బాకొట్లు, ఇతర ఆక్రమణలను తొలిగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెండి కడియం బహూకరణ

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్వామివారికి మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన కొలిపాక రామకృష్ణ వెండి కడియాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మందవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, కోశాధికారి బుస్సా మహేష్, ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం



నీటి కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నేరేడుచర్ల : తెలంగాణ ప్రభుత్వం ఇంటింటికి మిషన్ భగీరథ నీరు అందించడంలో పూర్తిగా విఫలమైందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్ అన్నారు. గురువారం మండలంలోని కందులవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పీర్‌సాయబ్‌గూడెంలో తాగునీటి కోసం గ్రామస్తులు బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాపోలు నవీన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో నీటి సరఫరా చేయడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమయ్యారని ఆరోపించారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామస్వామి, సురేందర్, ఇక్బాల్ స్థానికులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

మేళ్లచెరువు : మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వట్టెపు సైదులు మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ ఫెయిల్ కావడం కొన్ని సందర్భాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లు పేలిపోవడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది సమన్వయ లోపాలతో విద్యుత్ కోతలు నిత్యకృత్యంగా మారుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సైదిరెడ్డి, వెంకయ్య, కృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, మధార్, దస్తగిరి, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

వానాకాలం పంటల సాగుపై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్‌లో గల రైతు వేదికలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో రైతులకు వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ మాట్లాడుతూ.. రైతులకు, యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. పంట మార్పిడి, ఆవశ్యకత, సమగ్ర వ్యవసాయ విధానాలు, వేసవి దుక్కులతో కలిగే లాభాలు, మిశ్రమ పంటల సాగులో వచ్చే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం నిర్వహణ



వేలం పాటలో పాల్గొన్న రైతులు, ఈఓ

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని లింగగిరిలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ వ్యవసాయ భూముల కౌలుకు సంబంధించి గురువారం ఈఓ గుజ్జుల కొండారెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ కొండారెడ్డి మాట్లాడుతూ.. 2023 నుంచి 2025 వరకు 2సంవత్సరాల కాలం పాటు 38ఎకరాలకు గాను కౌలుకు రూ.8లక్షల వరకు వేలంలో ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కాగా గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.లక్షా 53వేలు అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి అంజిరెడ్డి, దేవాలయ చైర్మన్ భిక్షమాచారి, అర్చకులు దామోదరాచార్యులు, రాఘవయ్య, కిరణ్‌కుమార్, నాగేంద్రబాబు, రమేష్, రాజు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందం అవగాహన



పాటలతో అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాకారులు

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్, నకిలీ విత్తనాలు, మానవ అక్రమ రవాణా, మహిళలు, పిల్లల భద్రత తదితర అంశాలపై ఆట, పాటలతో కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్, ఏఎస్‌ఐ పులి వెంకటేశ్వర్లు, సూర్యాపేట షీటీం హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, కళా బృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తెగిపడిన లిఫ్టు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట పట్టణంలోని ఓ ఆస్పత్రిలో లిఫ్ట్ తెగిపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. నకిరేకల్‌కు చెందిన దేశరాజు నర్సమ్మ అనారోగ్యంతో సూర్యాపేటలోని సిగ్మా న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరింది. గురువారం రాత్రి 9గంటల సమయంలో నర్సమ్మకు సిటీ స్కానింగ్ చేసి ఆస్పత్రి రెండో అంతస్తుకు తీసుకు వెళ్తుండగా ఒక్కసారిగా లిఫ్ట్ తెగిపడింది. దీంతో నర్సమ్మతో పాటు లిఫ్టులో ఉన్న సత్యనారాయణ అనే మరో వ్యక్తి తలకు, కాళ్లకు, నడుముకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. కాగా, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆస్పత్రి నిర్వహిస్తున్నారని, ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను తరలించేందుకు చుట్టూ ఖాళీప్రదేశం లేదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి లిఫ్టులో సెక్యూరిటీ గార్డు లేరని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయానికి సామగ్రి బహూకరణ

పెన్‌పహాడ్ : మండలంలోని దూపహాడ్‌లో నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి, దుర్గామహేశ్వర నూతన ఆలయానికి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జునరెడ్డి సతీమణి శోభారాణిలు 10కేజీల ఇత్తడి గంట, నాగపాణి, జలధార, హారతి వస్తువులను దేవాలయ నిర్మాణ కర్త, సర్పంచ్ నాగేశ్వర్‌రావుకు గురువారం అందజేశారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలి

మునగాల : వచ్చే వానాకాలం సీజన్‌లో ప్రతీ రైతు అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ ప్రచారకర్త మొలుగూరి గోపయ్య కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని జగన్నాథపురం, నర్సింహులగూడెం, రేపాల, విజయరంగాపురం, కలకోవ, తాడ్వాయి, బరాఖత్‌గూడెం, ముకుందాపురం, ఆకుపాముల గ్రామాల్లో స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన రైతు చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే, భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు.

సీడీ ఆవిష్కరణ

ఆత్మకూరు (ఎస్) : సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జన్ను సార్) పాటల సీడీని గురువారం ఆత్మకూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యుడు డాక్టర్ కొప్పుల రంగారెడ్డి మాట్లాడారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు చేపట్టిన వ్యక్తి జన్ను అన్నారు. పేదలు జన్నుసారును మర్చిపోలేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు తహసీల్దార్, న్యాయవాది లింగంపల్లి భద్రయ్య, భాషపంగు భాస్కర్, లింగంపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బయ్యా నారాయణ



మోతె : మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్యా నారాయణ టీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణ పార్టీ నుంచి మండల ఎంపీపీగా, జెడ్పీటీసీగా గెలుపొంది తన సేవలు మండల ప్రజలకు అందించారన్నారు. తనను రెండో సారీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక చేయడం పట్ల ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.